క్లుప్తంగా

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేసిన కలెక్టర్



శ్రీలతకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టులో ఎంఐఏవోగా పనిచేస్తున్న ఎం.నాగేంద్రరెడ్డి గతేడాది మే నెలలో హార్ట్‌ఎటాక్‌తో మరణించారు. అతని కుటుంబానికి ప్రాజెక్టు అధికారి కార్యాలయం వారు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసి ఈ నెల 25వ తేదీ ఏపీఎంఐపీ కార్యాలయానికి చెక్కు పంపారు. ఆ చెక్కును స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా నాగేంద్రరెడ్డి భార్య శ్రీలతకు సోమవారం అందజేశారు.

5న గ్రామీణ వైద్యుల 8వ మహాసభ

ఒంగోలు రూరల్: గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ప్రకాశం జిల్లా 8వ మహాసభను ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఉలిచి లెనిన్ తెలిపారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఆర్ఎంపీలు, పీఎంపీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గృహ నిర్మాణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలి

ఒంగోలు టౌన్: పెరిగిన నిర్మాణ ధరలకు అనుగుణంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలను లబ్ధిదారులకు ప్రభుత్వం ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి విజ్ఞప్తి చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో మార్చి 2న విజయవాడలో నిర్వహించనున్న ధర్నా పోస్టర్‌ను స్థానిక మల్లయ్య లింగం భవన్లో సోమవారం ఆవిష్కరించారు. సీపీఐ నాయకులు సయ్యద్ సర్దార్, దాసరి సుందరం, కె.లక్ష్మయ్య, సీహెచ్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

యద్దనపూడి: మండలంలోని జాగర్లమూడి ఎస్సీ కాలనీలో పేకాట ఆడుతున్న ఐదుగురిని సెబ్ అధికారులు సోమవారం దాడి చేసి పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ యశోధరా దేవి తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశారు. దాడిలో ఐదుగురిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి రూ 2040 నగదు స్వాధీనం చేసుకొని పర్చూరు కోర్టులో హాజరు పరచనున్నట్లు ఆమె తెలిపారు. ఎవరైనా అక్రమ మద్యం అమ్ముతున్నా, పేకాట ఆడుతున్నా 9491 805156 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

రైతుల అభివృద్ధికి గొప్ప పథకాలు

చీరాల టౌన్: రైతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక రాయితీ పథకాలను అందిస్తోందని అన్నదాతలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీకే చైర్మన్ కె.రమణారెడ్డి సూచించారు. మండలంలోని కావూరివారిపాలెం గ్రామంలోని 11 మంది రైతులు స్ప్రింక్లర్ల కోసం రైతు భరోసా కేంద్రంలో దరఖాస్తులు చేయగా సోమవారం ఆర్‌బీకే అధికారులు పరిశీలన చేపట్టారు. కార్యక్రమంలో ఎం రత్నారెడ్డి, ఆర్‌బీకే అధికారి ఎమేలియా, డీసీవో సాయిరాం, గ్రామానికి చెందిన రైతులు ఉన్నారు.

కోస్తాంధ్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షురాలిగా పద్మినీదేవి

చీరాల టౌన్: కోస్తాంధ్ర పద్మశాలి సంఘం మహిళా విభాగం నూతన ఉపాధ్యక్షురాలిగా చీరాల జెడ్పీటీసీ ఆకురాతి పద్మినీదేవి నియామకం అయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు నుంచి నియామకపత్రం అందుకున్నాని ఆమె తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మహిళా విభాగానికి ఉపాధ్యక్షురాలిగా నియామకం చేసిన సంఘం బలోపేతానికి, పద్మశాలీలకు అండగా ఉండి సమస్యల పరిష్కారానికి పాటుపడుతానని ఆమె పేర్కొన్నారు.

వీఓఏపై సభ్యుల ఫిర్యాదు

యద్దనపూడి: స్వయం సహాయక గ్రూపుల మహిళలను మోసగించిన ఘటనకు సంబంధించి యద్దనపూడి పోలీస్‌స్టేషన్‌లో మహిళలు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై అనంతలక్ష్మి వివరాల మేరకు.. మండలంలోని దక్షిణ యద్దనపూడి గ్రామైక్య సంఘానికి సంబంధించి 4 గ్రూపుల మహిళలు బ్యాంకు నుంచి రూ.5 లక్షలు నగదు రుణం తీసుకున్నారు. 2014–2019 నుంచి తీసుకున్న రుణం నగదును బ్యాంకులో చెల్లించాల్సిందిగా వీఓఏ తన్నీరు అంకమ్మకు చెల్లిస్తూ వస్తున్నారు. అతడు ఆ నగదును వ్యక్తిగతంగా వాడుకొని బ్యాంకులో చెల్లించలేదు. ప్రస్తుత ఏపీఎం వెంకట్రావు గ్రూపు మహిళలను పిలిచి తీసుకున్న రుణం వడ్డీతో కలిపి రూ 7.78 లక్షలు బకాయి ఉందని చెల్లించాల్సిందిగా కోరాడు. వారు నగదును వీఓఏ అంకమ్మకు బ్యాంకులో చెల్లించాల్సిందిగా ఇచ్చామని తెలిపారు. అయితే అతనిని పిలిపించే ప్రయత్నం చేయగా అతడు కన్పించకుండా వెళ్లిపోయాడు. దాంతో గ్రూపుల మహిళలు సోమవారం స్టేషన్‌లో వీఓఏపై ఫిర్యాదు చేశారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆశాజనకంగా రబీ పంటలు



మండలంలో సాగవుతున్న పొగాకు పంట



శనగ పంట

ఒంగోలు రూరల్: మండలంలోని గ్రామాల్లో రబీలో సాగుచేసిన పంటలు ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నాయి. సకాలంలో వర్షాలు కురవడంతో పంటలన్నీ ఏపుగా ఎదిగి పచ్చగా కళకళలాడుతున్నాయి. గత 3 సంవత్సరాలుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో మండలంలో భూగర్భ జలాలు పెరిగాయి. వ్యవసాయానికి సమృద్ధిగా సాగునీరు అందుతుండటంతో రైతులు ఆనందంగా పంటలు సాగుచేస్తున్నారు. రబీలో పొగాకు, శనగ, మినుము అధికంగా సాగుచేయగా, రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు నానిపోయి పాడైపోగా, రైతులు పొలాలు దున్నివేసి మళ్లీ సాగు చేశారు. ఆయా పంటలు ప్రస్తుతం కళకళలాడుతున్నాయి. పొగాకు నారు మూట రూ.2 వేలకు కొనుగోలు చేసి మరీ మండలంలో 1,040 హెక్టార్లలో సాగుచేశారు. ఆలస్యంగా వేసినప్పటికీ ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. శనగ కూడా రెండోసారి సాగుచేసిన పొలాల్లో ప్రస్తుతం పూత దశలో ఉంది. మండలంలో మొత్తం 2,907 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. వరి 664, మొక్కజొన్న 29, మినుము 328, పెసర 1, కంది 2, జొన్న 5, మిర్చి 40, ధనియాలు 26, పత్తి 1, జూట్ 243, పశుగ్రాస జొన్న 21, కూరగాయలు 15 హెక్టార్లలో హెక్టార్లతో సాగుచేస్తున్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం పంటల విస్తీర్ణం పెరిగింది. భారీ వర్షాల కారణంగా శనగ కొన్ని పొలాల్లో పూత దశలో, కొన్ని పొలాల్లో కాయ దశలో, మరికొన్ని చోట్ల కోత దశలో ఉంది. రైతులు మంచి దిగుబడులు లభిస్తాయని ఎదురుచూస్తున్నారు.



సర్వే చేస్తున్న పంచాయతీ, రెవెన్యూ సిబ్బందితో ఎంపీడీవో, తహసీల్దార్, సచివాలయ సిబ్బంది

నివాస ప్రాంతాల సర్వే

మద్దిపాడు: మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల పరిధిలో భూముల రీసర్వే ప్రక్రియ పూర్తవుతున్న నేపథ్యంలో నివాస ప్రాంతాల్లో సర్వే చేయనున్నారు. ఈ క్రమంలో సోమవారం మండలంలోని నందిపాడు గ్రామంలో నివాస ప్రాంతాల సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ నందిపాడు గ్రామంలో నివాస గృహాల సర్వే ప్రక్రియను త్వరగా పూర్తి చేయడానికి సచివాలయ సిబ్బందిని రెండు టీములుగా ఏర్పాటు చేసి ప్రతి రోజూ 60 ఇళ్లకు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో వారం రోజుల్లో సర్వేను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఇంటి సర్వేలో ఇంటి ఎస్ఎస్ మెంట్ నంబర్, పూర్తి అనుభవంలో ఉన్న విస్తీర్ణం, యజమాని వివరాలు నిర్ణీత ప్రొఫార్మాలో నమోదు చేయాలని ఆదేశించారు. సర్వే ప్రారంభానికి ముందుగానే సంబంధిత ఇంటి యజమానులకు సర్వే చేసే సమయం తెలిపి వారి సమక్షంలో ఎటువంటి వివాదం లేకుండా ఆబాదీ సర్వే ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సూచనలు చేశారు. సర్వే చేసే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారు ప్రత్యేకంగా వివరించారు. వారి వెంట ఎంపీడీవో కార్యాలయ ఏవో సుబ్బారావు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, పలువురు గ్రామస్తులు, వలంటీర్లు పాల్గొన్నారు.

98 డీఎస్సీ అభ్యర్థి ఆనందం



బాలినేని సమక్షంలో సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న వెంకటేశ్వరరెడ్డి

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు

కొత్తపట్నం: కొత్తపట్నం గ్రామానికి చెందిన 1998 డీఎస్సీ బ్యాచ్ అభ్యర్థి కోడూరి వెంకటేశ్వరరెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గృహ సారధుల శిక్షణ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు. 98 డీఎస్సీ బ్యాచ్‌కి పోస్టింగ్‌లు పెండింగ్ పడటంతో వివిధ దినపత్రికల్లో 25 ఏళ్ల నుంచి తాను పనిచేస్తున్నట్లు తెలిపాడు. ఆరు నెలల క్రితం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తమ ఉద్యోగాలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో ఉపాధ్యాయుడు అవుతానని ఆనందంగా ఉందని సభాముఖంగా తెలిపారు. ఇప్పటికే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తియిందని, 25 ఏళ్ల నాటి సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించడం గొప్ప విషయమని వెంకటేశ్వరరెడ్డి కొనియాడారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం పాల్గుణ మాసం రోహిణి నక్షత్రం దశమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయస్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరుతాయని చెప్పారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

భవిష్య నిధి సమస్యల పరిష్కారంపై అవగాహన



మాట్లాడుతున్న ఈపీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా నోడల్ ఆఫీసర్ సమ్మయ్య

చీమకుర్తి: నిధి ఆప్‌కే నిక్కట్ (భవిష్య నిధి మీ ముందు) పేరుతో జిల్లా భవిష్య నిధి అధికారులు సోమవారం మండలంలోని రామతీర్థంలో వీటీసీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రానైట్ కార్మికులు, గ్రానైట్ క్వారీల్లో పీఎఫ్ సెక్షన్ నిర్వాహకులు పాల్గొన్నారు. ఈపీఎఫ్ చెల్లించే కార్మికులకు తిరిగి వారి పీఎఫ్ తీసుకునే సమయంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారంపై ఈపీఎఫ్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ నోడల్ ఆఫీసర్ ఎం.సమ్మయ్య అవగాహన కల్పించారు. జిల్లాస్థాయిలో పరిష్కారం కాని సమస్యలుంటే వాటిని గుంటూరు రీజినల్ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసే విధానం, సహకరించే అధికారుల వివరాలను ఈ సందర్భంగా తెలియజేశారు. ఇక నుంచి కార్మికులకు క్వారీ యజమానులు చెల్లించే ఈపీఎఫ్, కార్మికుల నుంచి మినహాయించుకునే పీఎఫ్ సొమ్మును కార్మికులు పొందే విధానాలను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీనివాసకుమార్ కోరారు. కార్యక్రమంలో ఈపీఎఫ్, లేబర్ డిపార్టుమెంట్ అధికారులు పవన్‌కుమార్, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, స్థానిక క్వారీల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధుర ఫలంపై చిగురిస్తున్న ఆశలు



మామిడి తోటలో నిండుగా ఉన్న పూత

వేటపాలెం: మామిడి చెట్లకు పూత ఆశాజనకంగా ఉండటంలో రైతులు ఆశలు చిగురిస్తున్నాయి. అయితే వాతావరణ మార్పుల కారణంగా మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మంచు కురవడంతో పాటు పూతకు నల్లితెగులు ఆశించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మామిడి పూత ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేటపాలెం మండల పరిధిలో పందిళ్లపల్లి, రామన్నపేట, చల్లారెడ్డిపాలెం గ్రామాల పరిదిలో దాదాపు 600 ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పందిళ్లపల్లి గ్రామానికి చెంది బంగినపల్లి అంటే తెలియని వారుండరు. అన్ని రకాల కాయలు పంట పూర్తయిన తరువాత మే, జూన్ నెలలో పండు కాయలు మార్కెట్‌లోకి ప్రవేశిస్తుంటాయి. ఈ ఏడాది ఇంతవరకు పూత ఆశాజనంగా ఉన్నప్పటికీ మంచు కారణంగా పూత మాడిపోతుందని రైతులు వాపోతున్నారు.

> **గత ఏడాదికంటే మెరుగ్గా..**
> గత ఏడాది కౌలు డబ్బులు కూడా రాలేదు. ఈ ఏడాది ప్రస్తుతానికి పూత ఆశాజనకంగా ఉంది. అన్ని అనుకూలంగా ఉంటే ఈ ఏడాదైన కొంత లాభం వస్తుందని ఆశిస్తున్నాం. రాబోవు రోజుల్లో మంచు కురవడం తగ్గి, వర్షాలు పడకుండా ఉంటే బాగుంటుంది.
> శ్రీనివాసరెడ్డి, మామిడి రైతు

నామ్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

అద్దంకి: నామ్ ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్ ఏల్చూరు టోల్ ప్లాజా యాజమాన్యం ఆధ్వర్యంలో అద్దంకి పట్టణం, మండల పరిధిలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు నామ్ ఎక్స్‌ప్రెస్ బాధ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో కంప్యూటర్ బేసిక్స్, ఎంఎస్ఎక్సెల్, ఎంఎస్‌వర్డ్, ఎంఎస్ పవర్‌పాయింట్, వర్డ్ ప్యాడ్, నోట్ ప్యాడ్, కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్, కంప్యూటర్ సెక్యూరిటీ అండ్ ఎథిక్స్ నందు శిక్షణ ఇస్తారని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు 91212 82536, 86395 91879 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.48 లక్షలు

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,48,606 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.55,990, స్వామి లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.21,240, స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు దాతలు ఇచ్చిన విరాళాల ద్వారా రూ.55,376, ఇతర విరాళాలు రూ 16,000 వచ్చినట్లు చెప్పారు. ఇందులో శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం, రామస్వామిపల్లి గ్రామానికి చెందిన యర్రం రెడ్డి సుబ్బరామిరెడ్డి, ప్రశాంతి దంపతులు రూ.30,348 విరాళం ఇచ్చినట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన విదేశీయులు



వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఒంగోలు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో 2022–23 వార్షిక సంవత్సరంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు సాగుచేస్తున్న పంటలను జర్మనీ దేశస్తులు సోమవారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రజలు ఎందుకు మొగ్గు చూపుతున్నారు, అందులోని కీలక అంశాలు, ఏయే పద్ధతులు పాటిస్తున్నారనే అంశాలపై పరిశీలన చేపట్టారు. ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ వారు చేపట్టిన ప్రకృతి వ్యవసాయంపై ఒంగోలు మండలంలోని రైతులు ఆకర్షితులు కావడానికి గల కారణాలు, దిగుబడులు, కొనుగోళ్లు, గిట్టుబాటు ధరలు, ఖర్చుపెట్టిన మొత్తం, తదితర అంశాలపై ఆరా తీశారు. జర్మనీ దేశానికి చెందిన సైంటిస్ట్ సర్వీ నెవురుస్ ఒంగోలు రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో తన బృందంతో పర్యటించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేస్తున్న పొలాలను నిశితంగా పరిశీలించారు. మొక్క విత్తే నాటి నుంచి పాటించిన పద్ధతులను రైతులనడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ భూపాల్‌రెడ్డి, అధికారులు సి.వెంకట్రావు, డీపీఎం సుభాషిణి, మండల ఏవో స్వర్ణలత, ఒంగోలు మండల అగ్రికల్చర్ ఆఫీసర్ కిషోర్‌బాబు, ప్రకృతి వ్యవసాయ లీడర్లు ఎల్–3 రాధా సింగమనేని, గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతిదేవికి పుష్పయాగం



పూలమాలలతో అలంకరించిన అమ్మవారు

కందుకూరు అర్బన్: పట్టణంలోని వెంకటనారాయణ బజారులో ఉన్న కోదండ రామాలయంలో సరస్వతిదేవి అమ్మవారికి పుష్పయాగం కన్నులపండువగా నిర్వహించారు. అమ్మవారి 15వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు పవన్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకం, మూలమంత్ర హోమం నీలిశెట్టి వెంకట సుబ్బారావు దంపతులు నిర్వహించారు. సరస్వతి అమ్మవారికి వేద పండితుల మంత్రాలతో పుష్పయాగం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని గజమాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి శ్రీను, గుర్రం సింగయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం

చీరాల టౌన్: ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా వ్యానులో తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్సై పి.జనార్దన్ వివరాల మేరకు.. సోమవారం ఉదయం రూరల్ సీఐ మల్లికార్జునరావు ఈపురుపాలెం గ్రామంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఈపురుపాలెం నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న ఏపీ 27 టీఎక్స్ 2995 వ్యానులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. ఈసమయంలో తనిఖీ చేయగా వ్యానులో 65 బస్తాలు రేషన్ బియ్యం బస్తాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈపురుపాలెం, తదితర ప్రాంతాల్లో బియ్యాన్ని సేకరించి వాహనంలో ఒంగోలు వైపుకు తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. డ్రైవర్‌ను, మరో ఇద్దరు వ్యక్తులను స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నామన్నారు. సీజ్ చేసిన బియ్యం, మినీ లారీని స్టేషన్‌కు తరలించామని తెలిపారు. ఈ నెల 9వతేదీ కూడా ఈపురుపాలెం నుంచి మినీ లారీలో అక్రమంగా 75 బస్తాలు రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామని, రేషన్ బియ్యాన్ని రవాణా చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

చీరాలలో గోవా మద్యం స్వాధీనం



పట్టుబడిన గోవా మద్యంతో సెబ్ అధికారులు

చీరాల: చాలా కాలంగా గోవా మద్యానికి చీరాల అడ్డగా నిలుస్తోంది. చీరాలతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో భారీగా విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో సెబ్ అధికారులు పక్కా సమాచారంతో విఠల్‌నగర్‌లోని ఒక నివాసంలో దాడులు నిర్వహించి గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాడులు సెబ్ సీఐ సోమయ్య ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సెబ్ కార్యాలయంలో సెబ్ డీఎస్పీ జి. నరసింహారావు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. విఠల్‌నగర్‌కు చెందిన మొగిలి రామారావు, మొగిలి సుబ్బారావులు కొంతకాలంగా గోవా నుంచి అక్రమంగా మద్యం తీసుకువచ్చి స్థానికంగా విక్రయిస్తున్నారనే సమాచారం ఈమేరకు నివాసంపై దాడి చేయగా మ్యాన్షన్ హౌస్ ఫుల్ బాటిల్స్ 60 దొరికినట్లు తెలిపారు. వాటిని సీజ్ చేసి మొగిలి రామారావును అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచినట్లు తెలిపారు. మరో ముద్దాయి సుబ్బారావు పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై వినీల, సిబ్బంది పాల్గొన్నారు.

కొండపిలో 271 పొగాకు బేళ్ల కొనుగోలు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో వేలం కేంద్రం అధికారి ఎస్.రామారావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పొగాకు వేలంలో రైతులు 271 బేళ్లను అమ్ముకున్నారు. వేలం కేంద్రం పరిధిలోని జువ్విగుంట క్లస్టర్ నుంచి పొగాకు రైతులు 315 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. వాటిలో 44 బేళ్లను వివిధ కారణాలతో వ్యాపారులు తిరస్కరించారు. కేజీ అత్యధిక ధర రూ.200 పలకగా, అత్యల్ప ధర రూ.195 పలికింది. కేజీ సరాసరి ధర రూ.197.54 దక్కింది.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

సింగరాయకొండ: స్థానిక కందుకూరు రోడ్డు సెంటర్‌లో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఏ బ్రహ్మయ్యను సోమవారం ఉదయం సెబ్ ఎస్సై దయాకర్ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అతన్ని కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ డ్రైవర్‌కు రూ.10 వేల జరిమానా

జరుగుమల్లి (సింగరాయకొండ): రాత్రివేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని డ్రైవర్‌కు రూ.10 వేల జరిమానా విధించినట్లు సెబ్ ఎస్సై దయాకర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. జరుగుమల్లి మండల పరిధిలో పాలేరు నుంచి సోమవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో రామనాథపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ డి.నరేంద్ర ఇసుక తరలిస్తుండగా నందనవనం గ్రామం వద్ద తన సిబ్బందితో దాడిచేసి ఎస్సై పట్టుకున్నారు. మొదటి తప్పు కింద అతనికి రూ.10 వేల జరిమానా విధించి ఇసుకతో సహా ట్రాక్టర్‌ను వదిలేశామని సెబ్ ఎస్సై దయాకర్ వివరించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని యువకుడు మృతి



మృతిచెందిన యువకుడు

టంగుటూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న గుర్తు తెలియని యువకుడు సోమవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు. ఈ నెల 24వ తేదీ జాతీయ రహదారిపై ప్రియాంక వే బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని సుమారు 25 సంవత్సరాల యువకుడు సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా, నెల్లూరు వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన యువకుడిని 108లో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు 5.5 అడుగుల ఎత్తు, చామన చాయ రంగు, నీలి రంగు ప్యాంటు, కాఫీ రంగు బెల్టు ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.